క్లుప్తంగా

జాతరలో ఘనంగా గంగమ్మ నాటక ప్రదర్శన

తిరుపతి కల్చరల్: ఈ ఏడాది గంగమ్మ జాతరలో గంగమ్మ తల్లి నాటకం భక్తులను ఆకట్టుకునేలా ఉండాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన శనివారం పౌరాణిక నాటకాల రిహార్సల్స్‌ను ప్రారంభించారు. అనంతరం అభినయ్ ఆర్ట్స్ కళాకారులను అభినందించారు. అభినయ ఆర్ట్స్ అధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి బీఎస్.రెడ్డి, గౌరవ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, మేర్లపాక మురళి, శైలకుమార్, సాకం నాగరాజు, గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణ పాల్గొన్నారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను మండపానికి వేంచేపు చేసి కల్యాణం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేపట్టారు. స్వామి, అమ్మవార్లు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

తిరుపతి అర్బన్: 18ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు కావాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. 25వ తేదీన ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం పాత మున్సిపల్ కార్యాలయం నుంచి అధికారులుస్కూటర్ ర్యాలీ నిర్వహించారు. డీఆర్వో శ్రీనివాసరావు, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, అర్బన్ తహశీల్దార్ వెంకటరమణ, ఆర్‌ఐ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పురంధరదాసు ఆరాధనోత్సవం



తిరుమల: శ్రీవారి పరమభక్తుడు పురంధరదాసు ఆరాధనోత్సవం శనివారం సాయంత్రం తిరుమల నారాయణగిరి ఉద్యానవనాల్లో భక్తి పారవశ్యంతో సాగింది. కర్ణాటకలోని ముళబాగళ్ శ్రీపాదరాజ మఠాధిపతి సుజయనిధి తీర్థ స్వామివారు పాల్గొన్నారు. శ్రీవారి ఆలయంలో సహస్ర దీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామివారు నారాయణగిరి ఉద్యానవనానికి చేరుకున్నారు. అక్కడ ఊంజల్ సేవ చేశారు. దాస ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనంద తీర్థాచార్యులు, జేఈవో సదాభార్గవి, వీజీవో బాలిరెడ్డి, ఆలయ పేష్కార్ శ్రీహరి, పారుపత్తేదార్ ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి కల్చరల్: ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో కర్ణాటక సంగీత పితామహుడు పురంధరదాసు ఆరాధనోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కళాకారులు, అధ్యాపకులు, విద్యార్థులు బృందగానం చేపట్టారు. అలిపిరి వద్దనున్న పురంధరదాసుల విగ్రహానికి దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనంద తీర్థచార్యుడు పుష్పాంజలి ఘటించారు. ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా పశువుల పండుగ



పాకాల: మండలంలోని గాదంకిలో శనివారం పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎద్దులను అందంగా తీర్చిదిద్ది పలకలు కట్టారు. కొంతమంది చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఫొటోలను ఎద్దుల కొమ్ములకు కట్టి బరిలో వదిలారు. వాటిని సొంతం చేసుకునేందుకు యువకులు పోటీ పడ్డారు.

గుండాలకోనలో భారతీయుడు-2 సినిమా షూటింగ్

రామచంద్రాపురం: పీవీపురం గుండాల అటవీ ప్రాంతంలో శనివారం కమల్‌హాసన్, కాజల్ అగర్వాల్ నటిస్తున్న భారతీయుడు-2 సినిమా షూటింగ్ చేపట్టారు. దర్శకుడు శంకర్ ఆధ్వర్యంలో పూర్వీకుల జీవనశైలి, కట్టుబాట్ల సన్నివేశాలను చిత్రీకరించారు. ఇందులో స్థానికులు కొండప్రాంత ప్రజల్లాగా నటించారు.

శిలా శిల్పాలయం తుంబురతీర్థం



తిరుపతి అలిపిరి: శేషాచలంలోని దివ్య తీర్థాల్లో తేజోవంతమైన శిలా శిల్పాలయం తుంబురతీర్థం అని ట్రెక్కింగ్ భూమన్ తెలిపారు. తిరుపతి అటవీ వన్యప్రాణి విభాగం కార్యాలయంలో శనివారం తుంబురతీర్థంపై బీవీ రమణ, ట్రెక్కింగ్ బాలు రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిచారు. భూమన్ మాట్లాడుతూ తీర్థాలకు సహజ సిద్ధంగా పేర్లు వచ్చాయని, వాటిని నేటి తరానికి చెందిన కొంతమంది వక్రీకరించడం సరికాదన్నారు. సీసీఎఫ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ దివ్య తీర్థాల విశిష్టతను నేటి తరం తెలుసుకోవాలన్నారు. బర్డ్ మెన్ కార్తీక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్లతో తిరుపతికి ఉజ్వల భవిష్యత్తు

- తిరుపతి రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



ఎల్ఐసీ రోడ్డులో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ

తిరుపతి తుడా: నగరాల భవిష్యత్ ఆయా ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధిపై ఆధారపడి ఉంటుందని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి నగరంలోని ఎల్ఐసీ రోడ్డు, ఐఎస్ మహల్ రోడ్డులో రూ.96 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్లను ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతి నగరంలో సరిపడా రోడ్లు లేకపోవడం ప్రజలకు శాపంగా మారిందన్నారు. ఈ సమస్యను గుర్తించి నగరానికి కనెక్టివిటీ పెంచడం, నగరం మరింతగా విస్తరించడమే లక్ష్యంగా రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలు ఏళ్ల తరబడి కనీస వసతులు లేని దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ క్రమంలోనే గడిచిన మూడున్నరేళ్లలో నగర శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించి సీసీ రోడ్లు, మురుగు కాలువలు, అండర్ డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.వందల కోట్లు ఖర్చు చేశామన్నారు. తిరుపతి అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక అనుమతులతోపాటు నిధులు ఇస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రిని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎల్ఐసీ రోడ్డు, ఐఎస్ మహల్ రోడ్లు పూర్తి స్థాయిలో పాడవ్వడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయన వెంటనే నిధులు మంజూరు చేయించి బీటీ రోడ్లు వేయించేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆదిలక్ష్మి, సీకే రేవతి, కల్పన, హనుమంత నాయక్, నరసింహాచారి, తిరుపతి మునిరామి రెడ్డి, నారాయణ, దూది కుమారి, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డీఈ రవీంద్రారెడ్డి, నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, కట్టా గోపీ యాదవ్, మునిరామిరెడ్డి, రాజేంద్ర, మోహన్, ఐఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి సీఎంకు రెండు కళ్లు

- గడపగడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి



కుమ్మరి చక్రాన్ని తిప్పుతున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పరిపాలన చేస్తున్నారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన శనివారం మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్లు ఆదిలక్ష్మి, రామస్వామి వెంకటేశ్వర్లుతో కలిసి 23, 29వ డివిజన్లలోని ఎల్ఐసీరోడ్, ఊతుకుంట ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. జగనన్న మూడేళ్ల ప్రగతి, అందించిన సంక్షేమ పథకాలను స్థానిక ప్రజలకు వివరించారు.

దేశ రాజకీయాలకే ఆదర్శప్రాయుడు జగనన్న

సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న పథకాలతో దేశ రాజకీయాలకే ఆదర్శప్రాయుడుగా నిలిచారని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన 4వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, దూది కుమారి, ఉమా అజయ్‌కుమార్, బోకం అనీల్, నాయకులు చింతలచేను గోపి, దొడ్డారెడ్డి మురళీరెడ్డి, మార్కెట్ వంశీ, కృష్ణచైతన్యయాదవ్, శ్రీదేవి, రాజ, బాబ్జి, రజనీ, సలీమ్, ఖలీమ్, శాంతారెడ్డి, శారద, గీత, మునస్వామి, గుర్రప్ప, నాదముని, ధన శేఖర్ పాల్గొన్నారు.

ఓట్లు వేయకపోయినా సంక్షేమ పథకాలు

- వందరోజులు పూర్తి చేసుకున్న గడప గడపకూ మన ప్రభుత్వం
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి వెల్లడి



సంబరాలు జరుపుతున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్లు

తిరుపతి మంగళం: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించిన గొప్ప నాయకుడు సీఎం వైఎస్.జగన్ అని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం 23వ డివిజన్ కార్పొరేటర్ ఆదిలక్ష్మి, 29వ డివిజన్ రామస్వామి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సంబరాలను జరుపుకున్నారు. ముందుగా ఎమ్మెల్యే చేసి కృషి తదితర సేవా కార్యక్రమాలపై రూపొందించిన పాటను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు టీడీపీ నాయకులు సైతం ఆకర్షితులై గడప గడపకూ కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నారని వివరించారు. జీవకోనలో ఉంటున్న టీడీపీ నేత సిద్ధయ్య ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నాడని, ఆ సమయంలో జగనన్న చేయూత ద్వారా రూ.18 వేలు ఖాతాలో జమ అయినట్లు మెసేజ్ రావడంతో తన ఆనందానికి హద్దులు లేవన్నారు. మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్లు అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ, దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, కార్పొరేటర్లు ఆదిలక్ష్మి, సీకే. రేవతి, దూది కుమారి, తమ్ముడు గణేష్, హనుమంత్‌నాయక్, బోకం అనీల్, గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, టౌన్ బ్యాంకు డైరెక్టర్లు, రఘురామిరెడ్డి, వేణు, ఊతుకుంట మోహన్, సాయి, కమల్, బాబ్జి, చాంద్‌బాషా, కుప్పస్వామి, మన్సూర్, మనోహర్, శ్రీనివాసులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లోపలి మాట పుస్తకావిష్కరణ

తిరుపతి కల్చరల్: శ్రీకాళహస్తికి చెందిన కథా రచయిత దేవీప్రసాద్ ఒబ్బు రచించిన లోపలి మాట పుస్తకాన్ని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సాహిత్యం అనేది సమాజంలో చైతన్యాన్ని సుసంపన్నం చేస్తుందని తెలిపారు. పుస్తక రచయిత దేవీప్రసాద్ ఒబ్బు మాట్లాడుతూ ప్రతి మనిషికీ తమ అంతరంగమే గొప్ప స్నేహితుడన్నారు. మానవ వికాస వేదిక సమన్వయకర్త సాకం నాగరాజు, అరసం అధ్యక్షుడు యువశ్రీ మురళి, కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం, బీఎస్.రెడ్డి, బాలాజీ, మురళి, సూరి పాల్గొన్నారు.

లోకకల్యాణార్థం ప్రతి నెలా హోమాలు

- టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి వెల్లడి
- ముగిసిన విశ్వశాంతి హోమం



హోమపూజల్లో వైవీ సుబ్బారెడ్డి దంపతులు

తిరుపతి కల్చరల్: లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ ప్రతి నెలా హోమాలు నిర్వహిస్తామని టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి తెలిపారు. కపిలేశ్వరాలయంలో ఈ నెల 16 నుంచి చేపట్టిన విశ్వశాంతి హోమం శనివారం మహా పూర్ణాహుతితో ముగిసింది. ఇందులో వైవీ.సుబ్బారెడ్డి దంపతులు, జేఈవో వీరబ్రహ్మం దంపతులు పాల్గొన్నారు. చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ దేశ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, కరోనా వంటి మహమ్మారి ఇకపై రాకుండా చూడాలని స్వామివారిని ప్రార్థిస్తూ విశ్వశాంతి హోమం నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా గణపతి, సుబ్రమణ్యస్వామి, దుర్గ, లక్ష్మీ, సరస్వతి, నవ గ్రహ, దక్షిణామూర్తి, రుద్ర, మృత్యుంజయ హోమాలు చేపట్టినట్లు తెలిపారు. తిరుపతిలోని ఎస్వీ వేద వర్సిటీలో శాశ్వత యాగశాల ఏర్పాటు చేశామని తెలిపారు. ఇకపై ప్రతి నెలా అక్కడ యాగాలు నిర్వహిస్తామని వివరించారు. సీఏఈవో శేషశైలేంద్ర, ఐటీ జీఎం సందీప్, ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చంద్రగిరి: సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం ఎంపీటీసీలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవ తో తుడా నిధులతో మండలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మండల పరిషత్ నిధులతో తాగునీటి సౌకర్యం, సీసీ రోడ్ల ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నట్టు వివరించారు. ఎంపీడీవో రమేష్‌బాబు, పీఆర్ ఏఈ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

లక్ష మొక్కల పెంపకానికి చర్యలు

తిరుపతి అలిపిరి: తిరుపతి–అనంతపురం జాతీయ రహదారిలో భాకరాపేట నుంచి కళ్యాణి డ్యామ్ వరకు రోడ్డు విస్తరణలో 10 వేల చెట్లు తొలగించనున్నట్టు తిరుపతి సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరావు తెలిపారు. ఆయన శనివారం సాక్షితో మాట్లాడుతూ భాకరాపేట కనుమలో 45 హెక్టార్లలో చెట్లు తొలగించాల్సి వస్తోందన్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా శ్రీకాళహస్తి రేంజ్ పరిధిలోని పల్లం సెక్షన్, మన్నవరం, చింతపాళెం బీట్‌లో ఇప్పటికే 90 వేల హెక్టార్ల భూమిని గుర్తించామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో లక్ష మొక్కలు నాటే ప్రక్రియ చేపట్టనున్నట్టు చెప్పారు. రూ.668.38 లక్షలతో 12 ఏళ్ల పాటు నిర్వహణ చేపడతామని వెల్లడించారు. త్వరలోనే ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు.

కొట్టమని.. టీడీపీ నేతకు లాఠీ ఇచ్చి..!

- ఎస్ఐ అరికాళ్లపై కొట్టాడు
- అవమానంతో చనిపోవాలనిపిస్తోంది
- సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సెల్ఫీ వీడియో

ఎర్రావారిపాళెం: 'ఎస్ఐ నన్ను కొట్టడమే కాకుండా నా ప్రత్యర్థి(టీడీపీ నేత)కి లాఠీ ఇచ్చి కొట్టించాడు. అవమానంతో ఆత్మహత్య చేసుకోవాలని అనిపిస్తోంది' అని బండమీదకమ్మపల్లెకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మురుగేష్ శనివారం సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. అందులో బండమీదకమ్మపల్లెకు చెందిన టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మహేష్‌నాయుడుకు తమకు స్థల వివాదం నడుస్తోందని తెలిపారు. గురువారం ఇద్దరి మధ్య గొడవ జరిగిందని, ఎస్ఐ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకుని తమను స్టేషన్‌కు తీసుకెళ్లారని పేర్కొన్నారు. స్టేషన్‌లో తన అరికాళ్లపై లాఠీతో విచక్షణారహితంగా కొట్టడంతో పాటు ప్రత్యర్థి మహేష్ నాయుడు చేతికి లాఠీ ఇచ్చి కొట్టించాడని వాపోయారు. మాట్లాడదామని వచ్చిన తన బంధువు ఎస్ఐపైనా దాడి చేశారని తెలిపారు. తనకు, తన కుటుంబానికి జరిగిన అవమానాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు పెంపుడు కోళ్లను తీసుకురమ్మని ఇద్దరు కానిస్టేబుళ్లను ఎస్ఐ పురమాయించారని తెలిపారు. ఈ విషయం బయటకు పొక్కడంతో తిరిగి శనివారం ఇచ్చేశారని తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు చేశాం

బండమీదకంపల్లిలో జరిగిన వివాదంపై మహేష్ నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మురుగేష్‌పై కేసు నమోదు చేశాం. మురుగేష్ ఇచ్చిన ఫిర్యాదుపై మహేష్‌నాయుడుపైనా కేసు నమోదు చేశాం. పందేలు ఆడతారనే సమాచారంతోనే కోళ్లు తీసుకువచ్చాం. వాటిని మళ్లీ తిరిగి మురుగేష్‌కు ఇచ్చేశాం. లాఠీతో టీడీపీ నేత చేత కొట్టించలేదు.

– ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎర్రావారిపాళెం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పాకాల: ప్రజలు సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని సీఐ రాజశేఖర్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు వాట్సాప్, ఈ మెయిల్, టెక్ట్స్ మెసేజ్ ద్వారా ఎస్‌బీఐ యోనో యాప్‌కు సంబంధించి పాన్‌కార్డ్, ఆధార్ వివరాలు అప్‌డేషన్ చేయాలని లింకులు పంపుతున్నట్లు తెలిపారు. వాటిపై క్లిక్ చేయడం ద్వారా మన బ్యాంకు ఖాతాలోని నగదు సైబర్ నేరగాళ్లు కాజేస్తారని వివరించారు. ఎవరైనా మోసపోయినప్పుడు సైబర్ క్రైమ్ విభాగం లేదా 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు.

గోమాతకు నామకరణం



తిరుపతి కల్చరల్: సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్, తిరుపతిలోని వైశ్య సంఘాలు, గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ సంయుక్తంగా శనివారం మహతి కళాక్షేత్రంలో గోమాత లేగదూడకు నామకరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. టీటీడీ బోర్డు సభ్యుడు మురం శెట్టి రాములు, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, మేయర్ శిరీష గోమాతకు, లేగ దూడకు పూజలు చేసి లేగ దూడకు కపిలేశ్వరుడిగా నామకరణం చేశారు. ఏఎస్పీ కులకర్ణి, కాణిపాకం ట్రస్ట్ బోర్డు సభ్యుడు నరసింహులు, సౌత్ఇండియా వైశ్య యూత్ పరిషత్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బాలాజీ, తిరుపతి మహానగర ఆర్యవైశ్య సంఘం కన్వీనర్ మహేష్, కోశాధికారి శిరీష మంజునాథ్ పాల్గొన్నారు.

ప్రమాద రహిత రవాణాకు చర్యలు

తిరుచానూరు: ప్రమాణికులకు ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాలు జరగకుండా ఉండేలా రహదారులపై చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎన్‌హెచ్- 205 ప్రాజెక్ట్ డైరెక్టర్ జనకుమారన్‌ను ఆదేశించారు. ఆయన శనివారం జిల్లా ఆర్ అండ్ బీ ఇంజినీరింగ్ అధికారి సుధాకర్‌రెడ్డి, జిల్లా రవాణా శాఖాధికారి కె.సీతారామిరెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ విజయకుమార్, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్‌హెచ్205 డైరెక్టర్ జనకుమారన్, దుర్గాప్రసాద్‌రెడ్డి, తమిళ్ అరసన్‌తో కలిసి సి.మల్లవరం జంక్షన్ నుంచి రామానుజపల్లి, రామచంద్రాపురం సర్కిల్, తనపల్లి, తిరుచానూరు సర్కిల్ వరకు పరిశీలించారు. అవసరమైన చోట్ల బ్లింక్స్, సైన్ బోర్డ్స్, లైటింగ్‌ను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

తిరుపతి అర్బన్: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కే.వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం తిరుపతి గృహ నిర్మాణశాఖ అధికారులతో సమావేశమయ్యారు. తిరుపతి నగర వాసులకు ఎం.కొత్తపల్లె, చిందేపల్లె, సూరప్పకశం, కల్లూరు, జిపాలెం లేఅవుట్‌లలో నిర్మిస్తున్న ఇళ్ల పనులను వేగవంతం చేయాలని సూచించారు. హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ శ్రీనివాస ప్రసాద్, ఈఈలు చంద్ర శేఖర్ బాబు, మోహన్, డిప్యూటీ కమిషనర్ చంద్ర మౌళీశ్వర్ రెడ్డి, రెవెన్యూ, మున్సిపల్ ఇంజినీర్లు, హౌసింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సమాజ చైతన్యానికి దిక్సూచి పుస్తకం

తిరుపతి కల్చరల్: వ్యక్తి వికాసానికి, సమాజ చైతన్యానికి దిక్సూచి పుస్తకాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో ఇస్కాన్ వద్దనున్న క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన 15వ పుస్తక ప్రదర్శనను శనివారం సాయంత్రం ప్రారంభించారు. మనసు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ మన్నం వెంకటరాయుడు, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ నేటి డిజిటలైజేషన్‌లో పుస్తక పఠనం కొరవడిందన్నారు. భారతీయ విద్యాభవన్ ప్రతినిధి సత్యనారాయణరాజు మాట్లాడుతూ పుస్తక పఠనం, పుస్తకాల ప్రచురణలపై భారతీయ విద్యాభవన్ చేస్తున్న కృషిని తెలియజేశారు. అంతకుముందు పుస్తకాలను పల్లకీలో ఊరేగింపుగా తీసుకొచ్చారు.

జీతాలు పెంచాలని విద్యుత్ బస్సు డ్రైవర్లు డిమాండ్

తిరుపతి అర్బన్: జీతాలు పెంచాలని విద్యుత్ బస్సుల డ్రైవర్లు డిమాండ్ చేశారు. నిరసన చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీటీఎం భాస్కర్, అలిపిరి డిపో మేనేజర్ హరిబాబు అక్కడికి చేరుకున్నారు. ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. వారి ఆదేశాలతో డ్రైవర్లు నిరసనకు స్వస్తి చెప్పి విధులు నిర్వహించారు. అవసరమైతే మంగళం డిపోకు చెందిన 30 బస్సులను తిరుమలకు నడపడానికి ఆర్టీసీ అధికారులు సిద్ధం చేశారు.

దొంగ అరెస్టు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో శనివారం ప్రయాణికులు దొంగను పోలీసులకు అప్పగించారు. నెల్లూరు బస్సుల ప్లాట్‌ఫాం వద్ద ఒక కుటుంబం తిరుమలకు వెళ్లడానికి దిగారు. ఒక యువకుడు వారి బ్యాగును లాక్కుని వెళ్లిపోయాడు. గమనించిన తోటి ప్రయాణికులు అతన్ని పట్టుకుని హెడ్ కానిస్టేబుల్ ఎస్.పరమేశ్వర్‌రెడ్డికి అప్పగించారు. విచారణలో అతను తాడేపల్లి గూడెంకు చెందిన వాసు(26)గా తేలింది.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

తిరుపతి క్రైమ్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ డీఎస్పీ కాటమరాజు తెలిపారు. ఆయన శనివారం రోడ్డు భద్రత వారోత్సవా ల్లో భాగంగా ఆటో డ్రైవర్లు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఆర్టీవో సీతారామిరెడ్డి, సీఐ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

భక్తుల్లో భగవంతుడిని చూడండి

తిరుపతి అలిపిరి: తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల్లో భగవంతుడిని చూడాలని, వారితో గౌరవంగా నడుచుకోవాలని టీటీడీ జేఈవో సదా భార్గవి తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్‌లో చేరిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు శనివారం తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి గృహంలో గుర్తింపు కార్డులు జారీ చేశారు.

చిన్నపిల్లలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు



పద్మావతి చిన్నపిల్లల గుండె చికిత్సాలయం డైరెక్టర్ డాక్టర్లు శ్రీనాథరెడ్డి, గణపతిని సత్కరిస్తున్న జేఈవో

తిరుపతి తుడా: రాష్ట్రంలోని చిన్న పిల్లలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందించేందుకు అలిపిరి సమీపంలో అత్యాధునిక ఆస్పత్రిని నిర్మిస్తున్నట్లు టీటీడీ జేఈఓ సదా భార్గవి తెలిపారు. ఆమె శనివారం ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆస్పత్రి పనులను పరిశీలించారు. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి నెలాఖరులోపు మొదటి దశ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్‌ను సందర్శించి, ఆపరేషన్ థియేటర్, మెడికల్ స్టోర్, క్యాథ్ ల్యాబ్ మొదలైనవాటిని పరిశీలించారు. పలు సూచనలు చేశారు.

విజయవంతంగా గుండె మార్పిడి

పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్లో ఇప్పటి వరకు వెయ్యికి పైగా గుండె శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించి చిన్నారులకు కొత్త జీవితాన్ని అందించిన ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ గణపతి నేతృత్వంలోని వైద్యుల బృందాన్ని జేఈఓ అభినందించారు. అనంతరం వారిని ఆత్మీయంగా సన్మానించారు.